షార్ట్‌కట్‌తో ట్రాఫిక్ ఇక్కట్లు

- శీలానగర్–కిమ్స్ ఐకాన్ రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లు
- సమస్యను పరిష్కరించాలంటున్న వాహన చోదకులు


కిమ్స్ ఐకాన్ మలుపు వద్ద ట్రాఫిక్ సమస్య


శీలానగర్ ఇరుకు రోడ్డులో ట్రాఫిక్

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి నుంచి కుర్మన్నగర్ మలుపు వరకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుక్కవానిపాలెం నుంచి కుర్మన్నగర్ మీదుగా శీలానగర్ వరకు కొత్తగా రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో కార్లు, వ్యాన్లు, సరకు రవాణా వాహనాలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఇది సింగిల్ రోడ్డు మాత్రమే. దీనిపై ఒకేసారి పక్కపక్కన రెండు వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. దీంతో రోజూ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

దగ్గరి దారి కావడంతో..

ఆటోనగర్, గ్రీన్ సిటీ, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, దువ్వాడ తదితర ప్రాంతాల నుంచి ఇది చాలా దగ్గరి మార్గం. దీంతో వాహనచోదకులు శీలానగర్ మీదుగా షార్ట్ కట్‌లో జాతీయ రహదారికి చేరుకుంటున్నారు. అయితే వాహనచోదకులు శీలానగర్ నుంచి తిరిగి ఆయా ప్రాంతాలకు చేరుకునే క్రమంలో రద్దీ మరింతగా పెరుగుతోంది. శీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మీదుగా, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి మలుపు నుంచి కుర్మన్నగర్ రోడ్డుకు అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో నిత్యం యాతనే. ద్విచక్ర వాహనాలు, వన్‌వేగా కార్లకు మాత్రమే అవకాశమున్న ఈ రోడ్డులో ఎదురెదురుగా రెండు కార్లు వస్తే చాలు. ఇక ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నట్టే. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలపడంతో ఇబ్బందులు మరింతగా పెరుగుతున్నాయి.

స్థానికులు గగ్గోలు

నిత్య పెరుగుతున్న వాహనాల రద్దీతో స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు, గృహయజమానులు గగ్గోలు పెడుతున్నారు. తమ దైనందిన కార్యకలాపాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగించేటపుడు ఇంటికి చేరుకునేందుకు నానా యాతన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కార్యాలయాలు, స్కూళ్లకు వెళ్లి, తిరిగి వచ్చే సమయంలో ఇదో పద్మవ్యూహంగా మారుతోందంటున్నారు. కార్లున్నప్పటికీ.. సాధ్యమైనంత వరకు ద్విచక్ర వాహనాల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని చెప్తున్నారు. ఈ రోడ్డులో ఓ నివాసం వద్ద కారు వెళ్తే.. దాని పక్క నుంచి ద్విచక్ర వాహనం వెళ్లేందుకూడా తావులేదు. ఒకేసారి రెండు కార్లు ఆ ప్రాంతంలో ఎదురుపడితే.. వారు తేరుకునే లోపే, ఆ రెండింటి వెనుక వాహనాలు చేరి, ట్రాఫిక్ చక్క దిద్దడానికి చాలా సమయం పడుతుందంటున్నారు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదే షార్ట్ కట్

ఈ రోడ్డు మీదుగా వెళ్తే దూరం, సమయం కలిసి వస్తుంది. ఇది దగ్గరి మార్గంగా కావడంతో కుర్మన్నగర్ నుంచి శీలానగర్ మీదుగా హైవేకు చేరుకునేందుకు ఈ రోడ్డును ఆశ్రయిస్తున్నాం. సరిగ్గా కిమ్స్ ఐకాన్ వద్దకు వచ్చే సరికి ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుంటున్నాం. దీంతో దూరం మాట దేవుడెరుగు.. సమయానికి వెళ్లే పరిస్థితి ఉండట్లేదు.
– వెంకట్రావు, ఆటోనగర్

ఇరుకురోడ్డుతో ఇబ్బంది

కిమ్స్ ఐకాన్ నుంచి కుర్మన్నగర్ మలుపు వరకు ఉదయం సమయంలో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. నిత్యం ఇదే సమస్య. రోడ్డు ఇరుకుగా ఉండటమే దీనికి కారణం. ఇంతకంటే నాకు వెళ్లేందుకు వేరే మార్గం లేదు. హైవే మీదుగా రావాలంటే చాలా దూరమవుతుంది. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలి.
– మహాలక్ష్మి, దువ్వాడ

చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం


గాజువాక ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్నాలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై చంద్రబాబు అహంకార పూరిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ పాతగాజువాక జంక్షన్‌లో శనివారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇళ్లులేని పేదవారికి దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలను ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించడంపై చంద్రబాబు అక్రోశం వెళ్లగక్కడం ఆక్షేపణీయమని మండిపడ్డారు. సెంటు భూమి శవం పూడ్చడానికి కూడా సరిపోదంటూ మతి తప్పి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బినామీల పేరుతో వేల ఎకరాలను మింగిన చంద్రబాబుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం మింగుడు పడటంలేదన్నారు. పేదలను అవమానించిన చంద్రబాబుకు రాష్ట్రంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల వారు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, నాయకులు మంత్రి రాజశేఖర్, రాజాన వెంకటరావు, మార్టుపూడి పరదేశి, దొడ్డి రమణ, పూర్ణానంద శర్మ, కోమటి శ్రీనివాస్, మెడికల్ బాబు, మాటూరి శ్రీనివాసరావు, సింగంపల్లి దేముడు, ఎన్నేటి రమణ, మంత్రి శంకరనారాయణ, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, సాపే బ్రహ్మయ్య, సంపంగి ఈశ్వరరావు, శ్రీదేవి, రోజా రాణి, పేరం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రసన్న వేంకటేశుని సన్నిధిలో జెడ్సీ


ప్రసన్న వేంకటేశ్వరుడిని సన్నిధిలో జెడ్సీ సింహాచలం, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ వద్ద నున్న ప్రసన్న వేంకటేశ్వరుడిని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్‌లు శనివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు అధికారులకు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం వేంకటేశుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

23న కళాశాల భవనం ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేటలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని ఈ నెల 23న ప్రారంభించనున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.బెన్నస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఏసీపీ


ఎమ్మెల్యే నాగిరెడ్డితో ఏసీపీ మోసెస్ పాల్

పెదగంట్యాడ: హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మోసెస్ పాల్ శనివారం స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టే చర్యల్ని వివరించారు.

చిన్నారులకు డ్యాన్స్ పోటీలు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు శనివారం డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఎల్ సురేష్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు.

పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని వినతి

అగనంపూడి: గాజువాక నియోజకవర్గంలోని పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని, వారికి కార్పొరేషన్ ద్వారా మేలు జరిగేలా చూడాలని కోరుతూ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ(పూర్ణ)కు అగనంపూడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, ఎన్నేటి రమణ శనివారం వినతిపత్రం అందించారు. ముందుగా బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైనందుకు పూర్ణను శాలువా కప్పి, అభినందించారు. అనంతరం నియోజకవర్గం పరిధిలోని పేద బ్రాహ్మణుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో చిత్రాడ రమణ, పిన్నింటి సంతోష్, ద్వారంపూడి రామిరెడ్డి, గెద్దాడ నూకరాజు, ఎల్‌బీసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్‌ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీ సీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే నాగిరెడ్డి


ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలను అమలు చేసినట్టు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 72వ వార్డులోని వుడా కాలనీలో వార్డు అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కరోనా, ఆర్థిక కష్టాలున్నా పేదల సంక్షేమాన్ని విస్మరించకుండా, వారి అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కుల, మత, పార్టీ అనే తేడాల్లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత దేశంలో ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాలన సాగిస్తున్నట్లు వివరించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకే ఇంటింటికీ వస్తున్నట్టు తెలిపారు. ప్రజల్ని పట్టించుకున్నాం, వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నాం కాబట్టే ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లగలుగుతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం


క్రీడల ప్రారంభోత్సవంలో వేదికపై జ్ఞాపికలతో నాయకులు, నిర్వాహకులు

గాజువాక: స్థానిక శ్రీనగర్‌లోని డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శనివారం ఆటల పోటీలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు సేవలను అందిస్తున్న డిజైర్ సొసైటీ వేసవి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పిల్లలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు జి.రవిబాబు, స్థానిక నాయకులు సందీప్, రోహిణి, రవీంద్ర, లక్ష్మణ్, మహాలక్ష్మి నాయుడు, రమేష్, రజిని తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు సేవారత్న పురస్కారం


వలంటీర్ దేవికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో 65వ వార్డు సంజీవిగిరి కాలనీ సచివాలయానికి చెందిన వలంటీర్ డి.దేవికి సేవా రత్న పురస్కారం లభించింది. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు సచివాలయంలో శనివారం ఆమెను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. సేవాభావంతో పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న వలంటీర్లకు ఇలాంటి గౌరవం దక్కడం ఆనందంగా ఉందన్నారు. నిత్యం ప్రజలతోనే ఉంటూ, ప్రభుత్వ పరంగా అందే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పెద్దింటి మంగునాయుడు, జన సతీష్, పెంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటి చైర్మన్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో సరోజిని, స్వాతి, రత్నం, రామారావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

బీమా సొమ్ము చెల్లించేశారు

సాక్షి ఎఫెక్ట్..

అగనంపూడి: బీమా పాలసీ గడువు ముగిసిన తర్వాత, సంబంధిత పత్రాలను కార్యాలయంలో సమర్పించినా బీమా మొత్తం చెల్లించకుండా గాజువాక బ్రాంచ్ అధికారులు వేధిస్తున్న వైనంపై అధికారులు స్పందించారు. బాధితుడు కల్యాణరావు బీమా లోక్‌పాల్‌కు చేసిన ఫిర్యాదు ఆధారంగా సాక్షిలో గత నెల 30న 'ఎల్‌ఐసీ అధికారుల తీరుపై ఫిర్యాదు' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ప్రీమియం గడువు ముగిశాక గాజువాక కార్యాలయంలో బాండ్లు, ఇతర పత్రాలు సమర్పించినా నెలలు గడుస్తున్నా సొమ్ము చెల్లించలేదు. ఏదో ఒక వంకతో బాధితున్ని ఇబ్బంది పెట్టారు. ఆర్‌టీఐ ద్వారా వివరాలు కోరడంతో గత నెల 21న సొమ్ము చెల్లించేసినట్టు సమాధానం వచ్చింది. దీంతో బాధితుడు లోక్‌పాల్‌ను ఆశ్రయించాడు. ఈ విషయాన్ని సాక్షి ప్రచురించడంతో ఎల్‌ఐసీ ఉన్నతాధికారులు స్పందించి శనివారం బాధితునికి పాలసీ మొత్తాన్ని చెల్లించారు. ఈ సందర్భంగా బాధితుడు కల్యాణరావు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం


ఎర్నిమాంబ ఘటాలతో వస్తున్న భక్తులు


రథంపై ఎర్నిమాంబ ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద అగ్ని గుండాలపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయ శాఖ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు.

సంపత్ వేంకటేశ్వరునికి సుప్రభాత సేవ

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాస శుద్ధ పాఢ్యమి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలవేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులు నక్కా శంకరరావు, పల్లా పెంటినాయుడు, నమ్మి భాస్కరరావు, కొయ్య జగదీష్ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన, నక్షత్ర హారతి నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన ఉపసంహరించుకోవాలి


కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనే యోచనను కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షకు ఇంటక్ నాయకులు సంఘీభావం తెలిపారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అప్పగించేందుకే ప్రభుత్వరంగ సంస్థలను మూసివేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ నాయకులు నర్సింగ్‌యాదవ్, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా కొలిపాక


అప్పారావుకు నియామక పత్రం అందిస్తున్న నాగిరెడ్డి

అగనంపూడి: రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా అగనంపూడికి చెందిన ఉక్కు విశ్రాంత ఉద్యోగి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొలిపాక అప్పారావును నియమిస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని అప్పారావుకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శనివారం అందించారు. అనంతరం అప్పారావును దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అప్పారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, కూర్మన్నపాలెం, దువ్వాడ, గాజువాక ప్రాంతంలోని రైల్వే ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. గాజువాక, సబ్బవరం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న తలారివానిపాలెం అండర్ బ్రిడ్జిని విస్తరించి, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు చిక్కాల సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, తోకాడ రాము, దొడ్డి దేముడు, గందోళి పైడికొండ, బలిరెడ్డి సత్యనారాయణ, శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ సిమెంట్ వితరణ


ఎంపీ అందించిన సిమెంట్ బస్తాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: గ్రామదేవతలను ఆరాధించడం ద్వారా ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దల్లివానిపాలెం ఆర్.హెచ్.కాలనీలో సచివాలయం పక్కన నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం జరుగుతోంది. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి చొరవతో ఎంపీ ఎంవీవీ 100 బస్తాల సిమెంట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో, పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివ, గణేష్, జీలకర్ర నాగేంద్ర, గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో పండ్ల రసం పంపిణీ


చలివేంద్రంలో పండ్ల రసాన్ని పంపిణీ చేస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాలనీ కాళింగవీధి, గాంధీబొమ్మ సెంటర్ వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాళింగ వాలీబాల్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని పాదచారులకు, ప్రజలకు చల్లని పండ్ల రసం, మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో వివిధ పనులు నిమిత్తం బయటకు వెళ్లేవారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, వాలీబాల్ టీమ్ సభ్యులు ప్రగడ ధనుంజయ్, దుగ్గపు గిరిబాబు, ప్రగడ భరత్‌కుమార్, మార్పు ధనుంజయ్, ప్రగడ విజయ్‌కుమార్, ప్రగడ శేఖర్, బొడ్డ హేమంత్, పుల్లట పృధ్వి, బొడ్డ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును ప్రభుత్వ సంస్థగా కొనసాగించాలి'

పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి


828వ రోజు ఉక్కుదీక్షలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 828వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఉక్కు కర్మాగారంలోని పలు విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వేజోన్ ఇవ్వకుండా, ప్రత్యేకహోదా ప్రకటించకుండా ఎన్నికల హామీని తుంగలో తొక్కిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్మిక హక్కులను నేరవేర్చని గత ప్రభుత్వాలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. కార్మిక శక్తిని, ప్రజల ఆందోళనను గుర్తించి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు, మద్దతుదారులు పాల్గొన్నారు.